# ఆచార్యుడు...ఆచార్యుడు...

ద-ర్జా-గా, టార్చిలైటు వూపుకుంటూ వస్తూ ఉండడం వల్ల యెదట - కొంచెం పక్కగా ఉన్న తాటిచెట్టు నానుకొని యేదో యెత్తుగానూ, తెల్లగానూ కనపడగా "దెయ్యంబాబోయ్" అంటూ వొక యువకుడు కంగారుపడగా, రెండో యువకుడు, ఆమాటతోనే అదలిపోయి, "యెక్కడ్రా?" అంటూ అక్కడే, అలాగే, కొయ్యయిపోయాడు.

ఇద్దరికీ రెండు నిమిషాలదాకా వూపిరాడలేదు.

"ఏమిట్రా అదీ?"

"....................."

"మాట్టాడవేమిరా?"

"......దె-య్యం-రా"

"లైటు వెయ్యరా"

".........మీద పడిపోతుందిరా"

"....................."

"....................."

"పరుగెత్తుకుపోదాం?"

"వద్దు,వద్దు, వెనక్కి పోదాం"

"నీ మొగంలాగే వుంది. అదేమిట్రా మన యిల్లూ!"

"గట్టిగా మాట్లాడకురా నీతస్సా దియ్యా"

"ఎలా ఉందేమిటిరా?"

"తాటిచెట్టు నానుకుని-నిలువెత్తున-తెల్లగా-సున్నం పూసినట్టు-"

"చెట్టుకి సున్నం పూశారేమోరా"

"నీ మొగానికి పుయ్యలేదూ"

"వొక్కమాటు గప్పునలైటు వెయ్యరా తెలుస్తుందీ"

"బాబోయ్?"

"ఏడిసినట్టుంది నీ మొగతనం....ఇలా తే"

"ఉండు... అలా వులాక్కుంటా వేమిటి?...

......నేనివ్వను. వెలుగమ్మటే వచ్చి మీద పడిపోతే?"

"చీకట్లో మాత్రం రాలేదూ"

"..............."

"లైటు నాచేతికిచ్చి నువ్వు నా వెనక్కాల ఉండు నీకంత భయమైతే"

"నీకు మాత్రం మహా-మహా ధైర్యం యేడిసిందా యేమిటి"

"నీలాగ ఆడారి పెద్దమ్మ ననుకున్నావా యేమిటి నేను? లైటు నాకిచ్చెయ్యి ముందు"

## 2

చెరువుగట్టెక్కాక "హాసే అమ్మా" అంటూ లచ్చన్నా, "ఏమేవ్ రత్తీ" అంటూ సూరన్నా ఉండుండి పెడబొబ్బలు పెట్టారు. "దిమ్మచెక్కల్లాగ మాట్టాడరేమ్రా" అనీ, "చెముడా యేమిట్రా మాదిగ పీనుగుల్లారా" అనీ, మధ్య మధ్య శాస్త్రికూడా రెండుమూడు కేకలు వేశాడు. పరదేశికూడా "సుభద్రమ్మక్కయ్యగారూ! అమ్మాయీ, రత్తమ్మా" అని వొకమాటు పిలిచాడు.

కాని, ఎవరికీ, దేనికీ జవాబులేదు.

అదివరకే మనస్సు పీకుతూ ఉండడం వల్ల లచ్చన్న వూచలాగ తాటిచెట్టు వేపుకి బయలుదేరాడు. టార్చిలైటు వేసుకుని అతని వెనక్కాలే సూరన్న నడిచాడు. తరువాత చాకళ్ళూ, వాళ్ల తరువాత పెద్దలూ కదిలారు.

ముందు, నింపాదిగా, మొగమ్మీది గుడ్డ తప్పించి చూడగా ఆ మనిషి స్త్రీ, పైపెచ్చు సుభద్రమ్మ.

నోట్లో గుడ్డలున్నాయి. వొంటిమీద చైతన్యం లేదు.

అందరూ చుట్టూ మూగి, మెల్లిగా కట్లువిప్పి, రోడ్డుమీద పడుకోబెట్టారు. తరువాత లచ్చన్న, మొగమ్మీద నీళ్ళు చల్లాడు. సూరన్న నోట్లో నీళ్ళుపొయ్యబోగా "బయటికి వెళ్ళిన మనిషి, స్నానం చెయ్యకుండా మంచినీళ్ళు పుచ్చుకుంటుందిట్రా అప్రాచ్యుడా?" అని రుంజుకుంటూ శాస్త్రి చెంబు వెనక్కి లాగేశాడు.

మైలపడి ఉన్నప్పుడు పోకుండా, తన ప్రజ్ఞవల్ల ప్రాణాలు నిలుపుకుని

ఉన్న సుభద్రమ్మ, వొక్క అరగంటకి లేచికూచుని, తనవాళ్ల నందర్నీ చూసి బారుమంది.

"రత్తమ్మ వొదిన యేదే అమ్మా?"

"లేదూ?"

"లేదు"

"తీసుకుపోయారు కామోసురా నాయనా"

"ఎవరూ?"

"తరకలురా"

అంతా వులిక్కిపడ్డారు. లచ్చన్న కడుపులో రాయిపడింది.

"నేను రెండు పావంచాలు దిగాను. లాంతరు గట్టుమీదపెట్టి, రత్తి దిగబోతోంది. అలాంటప్పుడు యములాళ్లలాగ అయిదుగురు తురకలు వచ్చి మామీద పడ్డారు. నేను రెండు కేకలు వేశాను. అంతట్లో నానోట్లో గుడ్డలు కుక్కేశారు. నోరు నొక్కేశారు కామోసు రత్తికిక్కురుమనేనా అనలేదు. తరువాత నామొగమ్మీద ముసుగుపెట్టి ముగ్గురు తురకలు వోంభాయి పట్టారు. చెట్టుకు కట్టేస్తూ ఉండగా నాకు స్మృతి తప్పిపోయింది"

"తురకలు"

"అందులో వొకడు కొండలరాయడి అరుగుమీద మిషనుకుట్టీ సాయిబులా వున్నాడు"

గొంతుకు కూచుని ఉన్న లచ్చన్న కూలబడిపోయాడు. శాస్త్రి నిర్విణ్ణుడయిపోయాడు. సూరన్న కొంచెం తీవ్రంగా చూశాడు. పరదేశి కొంచెం దూరంగా జరిగాడు.

అప్పుడు లచ్చన్న, సూరన్నకేసి చూస్తూ "కారులో వెళ్ళినవాళ్ళు వాళ్ళే అన్నమాట" అనగా, సూరన్న "తెలిసింది కాదు... పోడి చేస్తును" అంటూ గభీమని లేచి నుంచున్నాడు.

## 3

లచ్చన్న, సూరన్నా వెళ్ళి కొండలరాయుణ్ణి పిలవగా "పొలం వెళ్ళాడండి" అని చెబుతూ, అతని తల్లి పార్వతమ్మ తలుపు తీసింది.

"మీ అరుగుమీద మిషనుకుట్టీ సాయిబుండీవాడు కాదూ?"

"అవునండి"

"ఇప్పుడున్నాడా?"

"లేదండి"

"ఏమయిపోయాడూ?"

"నాలుగురోజులక్రిందట సామానంతా పట్టించుకుని రాజమండ్రం వెళ్ళిపోయాడండి"

"మళ్ళీ రాలేదూ?"

"ఇవాళ వచ్చాడండి. కాని బాకీలన్నీ వసూలు చేసుకుని స్పందలడ్డాక మాయింట్లో భోంచేసి వెళ్ళిపోయాడు.

ఇది విని లచ్చన్నా, సూరన్నా మొగమొగాలు చూసుకున్నారు.

"ఎందుకండీ అబ్బాయిగారూ?"

ఎవరూ జవాబు చెప్పలేదు.

"మాట్లాడ రేమండీ?"

చెప్పడమూ మానడమూ అనే సందేహం తీరక సూరన్న, అలాగే మిడుతూ చూస్తూ నుంచోగా, జరిగినదంతా చెప్పి, లచ్చన్న గుమ్మం దిగాడు.

"అనకూడదు కానండీ, మీబేమ్మల యింటో ఆడపిల్లలు పుట్టగూడ దండబ్బాయిగారూ".

"............................"

"వారం రోజులనాడు రత్తమ్మగారు మా యింటో కూచుని నాతో చెప్పుకుని వెక్కి వెక్కి యేడ్చారండి పాపం".

"ఏంచేతో?"

"అమాస వెళ్లాక బుఱ్ఱ గొరిగించెయ్యడానికి రామేశ్వరం ప్రయాణం పెట్టుకున్నారుట కాదండీ?".

"అవును..... మా అమ్మా, నేనూ, మా అత్తా వద్దు మొఱ్రో అన్నాం. మారత్తమ్మవదిన యేచెర్లోనో, నూతిలోనో పడి చచ్చిపోతా నంది. కాని మా మామయ్య బలవంతాన ప్రయాణం స్థిరపరిచాడు".

"ఇప్పుడాపని చేయించకపోతే కులం చెడుతుందా యేమిటి లచ్చబ్బాయిగారూ?".

"మొగుడు చచ్చినవాళ్లకి, మా యిళ్ల, జుట్టు పనికి రాదు మీలోలాగ"

"వూరుకోండి సూరన్నగారు, నేర్చుకుపోయారు. ఈమని శాస్త్రుల్లుగారి కూతురికి తీయించారా? యనమండ్ర వెంకయ్యగారి మనమరాలి నేంచేశారూ? ప్రభల వెంకప్ప-"

"వాళ్లు మా అంత గొప్పవాళ్లా!"

సూరన్న యిలా అనేటప్పటికి లచ్చన్న తిరగబడి చూశాడు.

"ఇరవైయేళ్లు నిండని పిల్లకి బుర్ర గొరిగించడం- ఏం బేమ్మలు పోనిస్తురూ సూరన్నగారూ" అంటూ పార్వతమ్మ యీసడించింది.

సూరన్నకి తురకలమీద కంటే పార్వతమ్మ మీద యెక్కువ కోపం వచ్చింది.

అప్పుడు, లచ్చన్న మళ్ళీ గుమ్మా లెక్కి అరుగుమీద కూచుని, "ఏమేనా అందా, వూరికేనే యేడిచిందా మావదిన?" అని అడిగాడు.

"బేమ్మల యింట్లో ఆడదై పుట్టడంకంటే చాకలాళ్ల యింటో గాడిదై పుట్టడం మంచిదంటూ యేడ్చారండి పాపం"

"ఊ- హూ"

"అది విని సాయిబు, మళ్ళీ పెళ్ళి చేసుకోరాదా అన్నాడండి. దానికి అలాచేస్తే మా వాళ్లు బతకనిస్తారా?" అని జవాబు చెబుతూ రత్తమ్మగారు ఇంటికి వెళ్ళిపోయారు.

"సాయిబుతో మళ్ళీ యెప్పుడేనా మాట్టాడిందా?"

"మా యింటికి మజ్జిగ కోసం వచ్చినప్పుడల్లా సాయిబు పలకరించి యేవో జాలిగా మాట్టాడుతూ ఉండేవాడు. రత్తమ్మగారు కళ్లలో నీరు పెట్టుకుని వెళ్లిపోయీవారు".

లచ్చన్న సూరన్న కేసి చూశాడు. సూరన్న, పార్వతమ్మని వులుకూ వులుకూ చూస్తూ "మారత్తిని సాయిబూతో యెందుకు మాట్టాడనిచ్చావు నువ్వూ?" అన్నాడు.

"ఇది బాగుందండోయ్! మిచెలులుగారు యెవరితోటీ మాట్టాడకుండా చూస్తూకూచుండడమేనా యేమిటండి మాపని?" అని ఝుణాయించి బదులుచెప్పింది పార్వతమ్మ.

సందుమళ్ళాక "యీకుట్రలో పార్వతమ్మ కూడా ఉంది" అంటూ సూరన్న అగ్నిహోత్రం అయిపోయాడు. లచ్చన్న, సూరన్న కేసి, చీకటిని చీల్చుకుపోయే వాడి చూపు చూశాడు.

"చిత్తం చిత్తం అయిదువందల రూపాయల నగల తోటీ, నూటయాభై రూపాయల రొక్కంతోటీ"

"బాగానే వుంది. ఆ నగలు పెట్టుకుంటే చక్కదనం వస్తుంది. ఆ నూట యాభైరూపాయలూ పెళ్ళి ఖర్చులికి సరిపోతాయి. తరువాత"

"తమ రలా అంటే"

"కాకపోతే మీరు శుద్ధవైదీకం బ్రాహ్మలు కదా, మీలో వితంతువులికి రాగిపట్టీలేనా ఉండనివ్వరు కదా. అయిదువందల రూపాయల నగలు"

"చిత్తమండి నాయుడుగారూ, నగలు దానివేనండి"

"మరి రూపాయలు?"

"ఇంటో వండి"

"అంటే?"

"ఇంటి ఖర్చులకోసం తల్లిదగ్గిర ఉన్నవండి"

"అయితే, మీ అమ్మాయి యిష్టం మీదే వెళ్ళిపోయిందన్నమాట సాయిబుతోటి"

"లేదండి, లేదండి. బ్రాహ్మణస్త్రీ సాయిబుతో యిష్టపడుతుందాండి? చెరువుగట్టుమీదకి బయటికివెళ్లి వస్తూ వుంటే, కూడావెళ్ళిన మా చెల్లెల్ని నోట గుడ్డలు కుక్కి ముసుగేసి, తాటిచెట్టుకి కట్టిపెట్టి, మా పిల్లని బలవంతాన-"

"అయితే, నగలూ, రొక్కమూ అక్కడికెలా వచ్చాయి"

"....................."

"మాట్టాడ రేమండీ శాస్త్రులుగారూ?"

"....................."

"..............ఇదంతా కల్పనే కాదూ?"

"...................."

"అధికార్లతో వేళాకోళాలుటయ్యా నీకూ?"

"................."

"మీ అమ్మాయే సాయిబుతో లేచిపోయిందని వొప్పుకుంటావా లేదా యిప్పుడేనా?"

"తమరలా అంటే నేనేం మనవి చేసుకోగలనండి? తమరు అచ్చంగా తెలగా బిడ్డలు. నేను శుద్ధవైదిక బ్రాహ్మణ్ణి. నాకిలాంటి గట్టిచిక్కు వచ్చినందుకు తమరు వొడ్డెక్కించాలి, గాని హేళన చెయ్యడం ధర్మమాండి?"

"మీలో వైదీకం యేమీ కనపడ్డంలేదే?"

"ఏమండీ? నేను కావ్యాలు చదువుకోలేదా, ధర్మశాస్త్రం క్షుణ్ణంగా పరిశీలన చెయ్యలేదా, కొద్దిరోజుల్లోనే ఆధానం కూడా చెయ్యాలను కుంటున్నాను కదా"

"చదువుమాట కట్టిపెట్టండి. మీరు అబద్ధాలు చెప్పారా లేదా?"

"................"

## 4

"చిత్తం చిత్తం జరిగిందంతా నేను మనవి చేసుకుంటానండి. మా మామయ్య వొట్టి చాదస్తం మనిషండి. ఎక్కడ యెలా మాట్లాడాలో అతగాడి కేమీ తెలవదం-"

"అది నీకు బాగా చేత నవునన్నమాట"

"...................."

"నువ్వు అతికేలాగ అబద్ధాలాడబూనుకున్నా వన్న మాట. కదూ?"

"చిత్తగిస్తే తమకే విశదం అవుతుందండి"

"అయితే, సాయిబుతో లేచిపోయిన వితంతువు నీకు మేనమామ కూతురు కాదూ?"

"అవునండి"

"ఆమెకు పురుషవాంఛ- అంటే మొగుడనీ, బిడ్డలనీ, యిల్లనీ- ఇలాగ సుఖపడాలని ఆశ ఉందన్నమాటేనా?"

"...................."

"ఇరవైయేళ్లు నిండని స్త్రీకి - పోనీ, ఆమె అందగత్తేనా?"

"చిత్తం చిత్తం. మోడయిపోయినా చాలా అందగత్తేనండి"

"కనక నువ్వు పెళ్ళి చేసుకోలేకపోయావుటయ్యా"

"శాస్త్రం వొప్పుకుంటుందాండి"

"పోనీ, నీకు పెళ్లి కాలేదు కాదూ?"

"లేదండి"

"నువ్వు పాతిక యేళ్లవాడవు. కాస్తోకూస్తో వేషగాడవు. ఇద్దరూ వొక యింటిలోనే వుంటున్నారు కూడానూ"

"అదంతా యెందుకండీ!"

ఎందుకంటావా? ఉన్నదంతా నన్ను చెప్పెయ్యమంటావా?"

"ఏమీ లేదండి"

"అలాగటయ్యా?..........పాతిక యేళ్లు వచ్చినా నీకు పెళ్ళి కాలేదు... ఎంచేతా?......నీకేమీ ఆస్తిలేదన్నమాట. నువ్వీపాటికి బిడ్డలతండ్రివి కావలసినవాడవు. కాని నీకాయోగం పట్టలేదు. ఘోటకబ్రహ్మచారీ, తరుణ వితంతువూ మేనత్త మేనమామబిడ్డలు- వొక్కయింటో"

"కేసుకి సంబంధంలేని విషయాలు సెలవిస్తున్నారు తమరు"

"వినవయ్యా!..........ఆమె విషయంలో నీకు దుస్సంకల్పం కలిగింది. అదివరకి మాట యెలా ఉన్నా, దాంతో ఆమెకి పురుషవాంఛ పేటెత్తింది. అయితే, నువ్వు చెరుస్తావుకాని పెళ్ళిచేసుకోవు. కులంలో మళ్ళీ పెళ్ళి కావడం కష్టం. కనక విధం చెడ్డా ఫలం తక్కని మార్గం యెందుకని - సాయీ బయతే బీబీని చేసి పెళ్ళి చేసుకుని బీగం సాహేబాగా చేసి సుఖపెడతాడని అతనితో వెళ్ళిపోయింది. ఈకేసిలా జరిగింది. ఢిల్లీకి వెళ్ళినా దీనికి తిరుగులేదు".

"..................."

"వొప్పుకుంటావా లేదా?"

సర్కిల్ ఇన్‌స్పెక్టరిలా గద్దించాటప్పటికి, లచ్చన్న, "చిత్తం చిత్తం" అంటూ చేతులు పిసుక్కుంటూ కుంగిపోయాడు.

శాస్త్రీ, సూరన్నా లచ్చన్న కేసి తీవ్రంగా చూశారు. "తమరు కటాక్షించాలి. కూతురే కాకుండా, నాకు, పరువుప్రతిష్ఠలు కూడా పోయాయి. దుష్టుణ్ణి"

"దుష్టులెవరంటావయ్యా?"

"సాయీబు"

"మళ్ళీ అదేమాట"

"తమరు సెలవిచ్చిందే నిజమయితే నామేనల్లుణ్ణి కొంపలోనుంచి నిమిషంలో గెంటేస్తాను. కాని"

"తరుచు మీరేం చేస్తూ ఉంటారయ్యా"?

"స్నానమూ, సంధ్యా, జపతపాలూ, శాస్త్రచర్చలూ- ఈశ్వరానుగ్రహంవల్ల పుట్టెడు యీనాందారుణ్ణండి నేను. తపస్సేమిటో, శాస్త్రచర్చ లేమిటో"

"వృత్తిమాట అడుగుతున్నాను. గ్రామంలో లౌక్యవ్యహారాలు"

"నాకెందుకండీ అవీ?"

"పిల్లమీద యెలకనీ, యెలకమీద పిల్లినీ యెక్కిస్తూ రైతుల్ని పీల్చేస్తున్నావా లేదా?".

"రామరామా! నావ్యవహారాలే నేను చూసుకోనండి. నా కర్మం కాలిపోతే, యింత చదువూ చదువుకుని యెంతో శిష్టు అనిపించుకుని - లౌక్యం యెందుకూ మహారాజా నాకు?"

"అయితే నాకు చేతనైన సాయం చేస్తాను. అసలు, మీ అమ్మాయి యిప్పుడెక్కడుందో, యేస్థితిలో ఉందో కనిపెట్టి, తరువాత సంగతి చెబుతాను. తరువాత రండి'.

"చిత్తం చిత్తం, ఈ సాయం చేశారంటే తమ మేలు మరచిపోనండి".

"ఏ మాత్రం తెస్తావయ్యా లంచమూ?"

"శ్రీహరీ.....శ్రీహరీ....!"

"అయితే యిక వెళ్లండి"

"చిత్తం"

ముందు శాస్త్రి బయలుదేరాడు. నిప్పులు కక్కుతూ, తరువాత సూరన్న కదిలాడు.

## 5

"ఆవిడ చెరువునుంచి వచ్చే వేళయింది. ఇక శాంతించండి"

"ఇక వొకటే శాంతించడం, ఈ వ్యవహారం యేమిటో తేలిపోయాక వాళ్లకి వుద్వాసన తప్పదు".

"మీతో మంచి వచ్చినా కష్టమే చెడ్డ వచ్చినా కష్టమే. ఎవళ్లతోటీ ముభావంగా ఉండడం చేతకాదు మీకు. ఇష్టంవస్తే నెత్తెక్కించుకోవడమూ, లేకపోతే పాతాళానికి"

"పాతాళానికి తొక్కెయ్యకపోతే, ఆడపిల్లలున్న కొంపగదా, యిలాంటి పుండాఖోరులుంటే మర్యాదా నిలుస్తుందా?"

"................."

"అసలు, తల్లేవాడికి మద్దత్తు చేసి ఉంటుంది".

"ఊరుకోండి, యెవరేనా వింటే నవ్విపోయారు. బ్రాహ్మణయింటో పుట్టిన ఆడపిల్లను గెవర్తేనా కొడుకుని మేనగోడలిమీదకి వుసికొలుపుతుందిటండీ?"

"మన మంతా కాకినాడ వెళ్ళినప్పుడు, అది తన కొడుక్కి తల అంటమని పురమాయించింది కాదూ అమ్మాయినీ?"

"ఏదో యాదాలాభంగా అని ఉంటుందప్పు డావిడ. ఇక అల్లరి చెయ్యకండి. నిజమయినా, అబద్ధమయినా మనకే తలవంపులు".

"నోరుముయ్యి, ఆవేషాలిక నాదగ్గిర సాగవు"

"ఏమో ఏంచేసుకుంటారో యిక మీ యిష్టం.... చెప్పిన కొద్దీ మరీ బిర్రబిగుస్తారు మీరు... ముక్క పచ్చులారని కన్నకూతురికి నుంచున్న పాళంగా జుట్టు తీయించేస్తానని కూచున్నారు మీరు. ఇక మీరు చెయ్యలేని దేం ఉందీ?"

"..................."

"మీరంత మొండిపట్టు పట్టకపోతే మనకిప్పు డీతిప్పలు వచ్చి ఉంటాయా?"

"అయితే, అంచేత, రత్తేసొంతంగా లేచిపోయిందంటావు నువ్వు? కాదూ?"

"చాల్చాలు, కన్నకూతురనేనా లేకుండా ఆపాదు మాటలేమిటండీ?"

"అలాగేనోయ్! చూస్తూ ఉండు, ఏది యెలా జరిగిందో నీకే తెలిసిపోతుంది కొద్దిరోజుల్లోను".

'ఏమిటండీ తెలిసిపోయిందీ? మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి, అమ్మాయి అలాంటి మనిషి యెంతమాత్రమూ కాదు. దాని ఫామేదా మీకేం తెలుసునూ? అదెంత బాధపడుతుందో, యెంతగా యేడుస్తుందో-అదిగో సూరన్న వచ్చాడు. అమ్మాయి కనపడిందా నాయనా?"

"ఆ"

"ఆ అంటే? కవిత్వం యేడుస్తా వేమిటి తొరగా చెప్పక?"

"చెల్లాయి రాజమహేంద్రవరంలోనే తురకల యింటో ఉంది".

"వుంది నాయనా, ఎక్కడుందీ? నా తల్లి ప్రాణాలతో వుందా యింకా?"

"వుందూ....ఏమిటా యేడుపూ?...... వాణ్ణి చెప్పనియ్యవేం?"

"నువ్వు చూశావుట్రా అబ్బాయీ?"

"లేదమ్మా"

"అసలు నీకెలా తెలిసిందోయి వెధవాయీ అది రాజమహేంద్రవరంలోనే ఉన్నట్టు!"

"సర్కిల్ ఇనస్పెక్టరుగారు చెప్పారు. ఆయనకీ తురకల గురువుకీ స్నేహమట. ఆయన, ఆయన్నడిగితే నిజం చెప్పేశారుట"

"ఏమిటో ఆ నిజం?"

"అదంతా నాకు చెప్పలేదు. ఇనస్పెక్టరుగారు నిన్ను తీసుకురమ్మన్నారు".

"నేనెందుకింకా? అది తురకల యింటో ఉన్నాక యిక చచ్చేం బతికేం? శని విరగడ అయిపోయింది యిక వూరుకోండి."

"అయ్యో, అయ్యో, మీకు వచ్చిన యేళ్లెవరికి వచ్చాయండీ? అమ్మాయిని విడిచిపెట్టి వూరుకుంటారుటండీ?"

"లేకపోతే తురకల యింటో ఉన్నదాన్ని మళ్లీ కొంపకి తీసుకు రమ్మంటావూ?"

"అది కులం చెడిందో లేదో మనకేమీ తెలవలేదు కదా, నీకీ తొందరెందుకు నాన్నా?"

"వోరి చచ్చుపెద్దమ్మా, తురక లింకా దాని కులం నిలవనిస్తారా? దాన్ని తీసుకు వస్తే వూరంతా మనకి వెలివెయ్యరూ? పరువూ ప్రతిష్ఠా యేమేనా దక్కుతాయా? నలుగురికీ మొగం చూపించగలమా? వంశం–"

"అందుకే మంటారండీ?"

"ఏముంది అనడానికీ? గప్‌చిప్‌గా వూరుకోండి. అది పుట్టలేదనుకోండి"

"చూశారా, చూశారా? మీది కడుపా చెరువా? పిల్ల బతికి ఉండగానే విడిచిపెట్టేస్తారుటండీ? ... ఎంత కర్మం వచ్చిందండీ?..... పోనీ మనం వెడదాం పద నాయనా."

"వో! నీ యిష్టం. నువ్వు వెళ్లినా సరే, వెళ్లి తురకల యింటో విందు కుడిచివచ్చినా సరే, కాని యింటికి వచ్చాక మాత్రం నాలిక తెగకాల్చి, పంచగవ్యప్రాశన చేయిస్తాను నీచేత, జ్ఞాపకం పెట్టుకో".

"తరువాత మీరేం చేసినా సరే, ముందు నేను చూడకుండా ఉండలేను సుమండీ! నా అంత మనిషి, మొగుడెలాగా లేడు, తల్లిపీనుగునని చెప్పుకుంటూ నేను బతికి ఉండి కూడా – నీకెన్ని పాట్లు వచ్చాయే మా తల్లీ?"

"నువ్వు ఏడు. మొత్తుకో. కాని యేమీ లాభం లేదు. నన్ను మాత్రం రమ్మనకు".

"నువ్వు రాకపోతే యెలాగ నాన్నా?"

"రాకపోతే నువ్వేం చేస్తావోయ్ ని-ర్భా-గ్య-దా-మో-ద-ర-చ-క్ర-వర్తీ!".......

"అదేమిటండీ, వాణ్ణలా కొట్టబోతారూ? మతిపోయిందా యేమిటి మీకూ?"

"నాకా మీకా?.......అది నా కూతురు కాదు. .....ఇక గింజుకు చావండి మీరు కట్టగట్టుకుని"

"మనం పోలీసుల దగ్గిర ఫిర్యాదు చేశాం గదా, వాళ్లు రమ్మన్నప్పుడు వెళ్ళకపోతే, కేసు యెదురు తిరగదూ నాన్నా!"

"వోరినీయిల్లు- నువ్వూ, లచ్చిగాడూ చేశారిదంతాను. పోతే పోయింది వూరుకోండర్రా అంటే పోలీసుల దగ్గరికి తీసుకువెళ్లి, నాచేత అవాకులూ, చవాకులూ పేలించి-నా బ్రాహ్మణ్యానికి యెసరుపెట్టారర్రోయ్ మీతలపళ్లు పగలిపోనూ".

"అబ్బాయీ! మీనాన్న నలా గింజుకోనియ్యి, మనం వెడదాం పద".

"వోసి నీ కడుపుకాలా, నువ్వు వెళ్లి నేను రానన్నానని చెబుతావా యేమిటే ఆ యినస్పెక్టరుగాడితోటీ. నువ్వెక్కడ దాపరించావే నాకు నీ యిల్లు-"

"మమ్మల్ని తిడితే యేం లాంభం నాన్నా?"

"......అవును. మిమ్మల్ని తిడితే యేం లాభమూ? నీ వంటి వాజమ్మలు నా కడుపున పుట్టాక- మరి పదండి".

## 6

"మీ కడుపున పుట్టిన బిడ్డ. ప్రాజ్ఞత వచ్చిన మనిషి. ఇష్టపడి తాను సొంతంగా వెళ్లలేదు. తురకలు బలవంతాన అన్నం నోట్లో కుక్కారు; గాని స్వయంగా పచ్చిమంచినీళ్లేనా పుచ్చుకోలేదు. మతంలో కలవడానికి సుఖసుఖాల వొప్పుకోలేదు. ఈ క్షణందాకా మీకోసం- మళ్లీ మీ యింటికి రావాలని యింకా యేడుస్తూనే ఉంది. అలాంటి పిల్లని"

"నేనేం చెయ్యగలను మహారాజా! రుషులలా నిర్ణయించారు. ధర్మశాస్త్రాలలా చెబుతున్నాయి. ఘటాశ్రాద్ధం చేసి అనుబంధం వొదుల్చుకోవలసిందే, కాని యిక వేరే దారిలేదు"

"దీని వల్ల మన మతం క్షీణించిపోదూ?"

"క్షీణించడం, పెరగడం- వీట్లతో అవసరంలేదు రుషులకు. వారికి మాత్రం స్వతంత్రత యేడిసిందా యేమిటి. వేదం చెప్పినట్టు 'తూచా' తప్పకుండా నడుచుకోవలసిందే కాని?"

"తమ పిల్లల్ని బలవంతంగా యెవరేనా తీసుకుపోతే యితరమతాల వారెవరేనా యిలా ఊరుకుంటారా?"

"వాళ్ళమతాలూ వొక మతాలేనా? కాకపోయినా, యిలాంటి అక్రమాలను చేసినవాళ్ళని మీపోలీసులేమీ చెయ్యరేం!"

"సర్కారులో మేము కేసు పెడతాము. అధికార్లు తురకల్ని శిక్షించి మీపిల్లని విడుదల చేయిస్తారనుకోండి, అయితే మీరు-"

"అది యిక మా పిల్లకాదు"

"................."

"దానికీ మాకూ సంబంధం పూర్తిగా తెగిపోయింది"

"అయితే, యిష్టంలేకపోయినా ఆవిడ తురక మతంలో ఉండిపోవలసిందేనా?"

"దాని కర్మం అంతే. ఇక దాని బతుకలా వెళ్లిపోవలసినదే".

"ఇలాగే రోజూరోజూ మనమతం క్షీణించి పోతోంది".

"మతం క్షీణించడం వొక అపాయం కాదు, అదికలితీ కాకుండా ఉంటేచాలు".

"కోట్లు వెలగల మాట అన్నారండీ. మీలాంటి మహానుభావులు పుట్టడం వల్లనే మనం యీస్థితికి వచ్చాం..........మీ కూతురికి "అంగా దంగా త్సంభవసి" అన్నారే మీవేదంలో, అలాంటి మీ....."

"అది యిక నా కూతురు కానేకాదంటే? కాకపోయినా, "అంగాదంగా త్సంభవసి" అనే రుక్కు పురుష విషయంకాని స్త్రీ విషయం కాదు. వేదమతంలో స్త్రీకి ఊరు పేరూ యేమి లేవు. అంతా పురుషుడిదే ప్రాజాపత్యం".

"అంచేతనే వేదం అంటే మన వాళ్లకే - మీబ్రాహ్మలకి కూడా సుమండీ"

"వేదం అంటే అగ్నిహోత్రం అన్నమాట. దానికి చలనం లేదు."

"మీ చిన్నతనంలో ఉన్న చెలామణీ ఉందా యిప్పుడు వేదానికి?"

"అది ప్రజల కర్మంగాని వేదానికి లోటు కాదు"

"అనుసరించే వాళ్లు లేకపోతే వేదం యేమిటి, శాస్త్రం యెందుకు?"

"......................"

"ఇంతకీ, మీ అమ్మాయి"

"మీరూ మళ్ళీ మళ్ళీ ఆ మాట అనవద్దు. అది నాకూతురు కాదు"

"మీరు నాలిక కోసుకున్నా సరే, జంధ్యాలు తెంపుకున్నా, సరే, ఆవిడ మీకూతురు కాకపోదు. ఇంతేకాదు. ఆవిణ్ణి తురక యువకుడొకడు పెళ్లి చేసుకుంటాడు. అతను తప్పకుండా మీ అల్లుడే అనిపించుకుంటాడు. వారికి పిల్లలు పుడతారు. వాళ్లంతా మీ మనమలే"

"......................"

"అంతటితో ఆగిందా? ముందు ముందు మీమనమలే మీమతం మీద దండెత్తుతారు. మీ అమ్మాయే వాళ్లని దీవించి మీమీదకి పురికొల్పుతుంది"

"సర్కా రేం చేస్తున్నా రంటాను"

"మీ రుషులో"

"వారి కిదేమీ అక్కరలేదు. దిక్కుమాలిన యీ చిల్లర విషయాలకోసం వారు తపస్సు మానుకుంటారా? కాలం వ్యర్థం చేసుకుంటారా? అదీకాక-వారు త్రికాలజ్ఞాన సంపన్నులు. వారు చెప్పనే చెప్పారు, అయిదువేల సంవత్సరాలు - విన్నారూ? "కలౌ పంచసహస్రాణి జాయతే వర్ణసంకరః" వేదంలో దీనికి ప్రమాణం ఉంది".

"అయితే మీరు కూడా సంకరులలోనే లెక్క........కాదూ!"

"అయ్యా! మీరు పెద్ద ఉద్యోగస్థులు. మీ మాట చెల్లుతుంది. ముక్కు మూసుకు కూచునే ముండాకొడుకుని, మీతో వాదం యేమిటి? సెలవిప్పించండి వెళ్ళిపోతాను."

"మీరూ తప్పకుండా వెళ్ళవచ్చు. కాని అదిగో మీ ఆవిడగారూ వస్తున్నారు. కలిసి వెడుదురుగాని ఉండండి"

"......................"

"ఏం యేం జరిగింది?"

"అది, తురకమతంలో కలిసింది"

"సొంతంగానే!"

"బలవంతాన వాళ్లే కలిపేశారు"

"వదలిపోయింది.మరి పోదాం పద"

"దాన్ని విడిచిపెట్టెయ్యడమే?"

"మరేం చేస్తామూ?"

"అది నన్ను తీసుకుపోవే "అమ్మా" అని మీద బడి యేడ్చిందండీ! చూడలేకపోయానండీ నేను"

"నువ్వే మన్నావూ?"

"ఏమనడానికీ–"వస్తే నన్ను చేర్చుకుంటారా?" అని మళ్లీ అదే అడిగింది".

"ఇంకేం? అది మాత్రం యెరగదా యేమిటి?....... నువ్వే మన్నా వన్నాను"

"ఇంటో కెలా రానిస్తారూ? ఒక పంచని ఉంచి అన్నం పడేస్తూ వుంటా"రని చెప్పాను. లోపలికి రానివ్వరని చెప్పాను, కాని యిలా చెప్పడానికి వోపట్టాన నాకు నోరు రాలేదు. పేగులు తరుక్కుపోయాయి. కడుపు చెరువయిపోయింది"

"అదే మందీ?"

"ఇంటోకి రానివ్వనప్పుడూ, పంచని అన్నం పడేసేటప్పుడూ యిక నేను వచ్చేం లాభమూ? బుద్ధిపూర్వకంగా తురకల్లోకి రానప్పుడు నాకీ శిక్ష యేం? కష్టమో సుఖమో యిక నేనిక్కడే వుండిపోతాను. పదేళ్లకిందట వొక వ్యాపారావిడ తురకల్లో కలిసిందట. నిన్న సాయంత్రం వచ్చి ఆవిడ యిలాగే చెప్పింది. మన – మీమతం వెధవమతం అని చెప్పింది. గంపెడు పిల్లలూ ఆవిడా–దోసతోటలా ఉంది సంసారం. నేనూ అలాగే ఉండిపోతానిక్కిడ. బీబీలంతా వచ్చి నన్ను నెత్తిమీద పెట్టుకుంటున్నారు. నేనే మీరింకా తీసుకువెడతారనీ, మళ్లీ కులంలో కష్టమో సుఖమో నలుగురితో పాటుగా ఉండవచ్చుననీ రావాలని యేడుస్తున్నాను. నన్ను మాదిగదానిలా చూస్తే మీమతం నాకెందుకూ? నాకింక తురకమతమే గతి. ఎవళ్లు వచ్చి కలిసినా తురకల్లో యేమీ భేదంలేదు. అంతా వొక్క కంచాన తిని యెక్కువతక్కువా

యెరక్కుండా వొక్కతాటి మీద ఉంటారు. కులం యెలాగా చెడ్డప్పుడిక యిక్కడేనా సుఖపడక నాకిక యేడు పెందుకూ? మిషనుకుట్టీ సాయిబు అన్నకొడుక్కి నన్ను పెళ్ళిచేసుకుంటారుట. సర్కారులో నెలకి దబ్బయి రూపాలయ ఉద్యోగం ఆయనికి. కన్నకూతుర్ని మీరు కనక విడిచిపెట్టుకో గలిగారు గాని తురక లెవరేనా విడిచిపెట్టి ఊరుకోగలరా?" అని అడిగిందది.

"చెడ్డ కాపురానికి ముప్పేమిటి, అలాగే యేడవ మనలేకపోయావా?"

"ప్రాయశ్చిత్తం చేయించి"

"ఇక వొక్కటే ప్రాయశ్చిత్తం. కంఠం ఉత్తరించడం వొక్కటే"

"సెబాస్! ఎంత మాట అన్నావయ్యా? ఏం బ్రాహ్మడవయ్యా శాస్త్రుల్లూ?" కరకుతనం నీలో కూడా తక్కువలేదు. కాని యిలాంటి సందర్భాల్లో తప్ప ఉండవలసినచోటు కాదు.. అయితే, అమ్మగారూ, అసలేం జరిగిందో చెప్పిందా మీ అమ్మాయి?"

"కాళ్ళు కడుక్కుందా మని చెర్లో దిగబోతూ వుంటే"

"కమ్మవారి యింటికి మజ్జిక్కి దానికీ వెళ్ళినప్పుడు సాయిబుతో"

"రామరామా! మా అమ్మాయి అలాంటిది కాదండీ! సాయిబు పలకరిస్తే దానికి వొళ్ళుమండిపోయిందిట. ఆ సంగతి మాకు తెలవక మేము దాన్నే మజ్జిగకోసం పంపేవాళ్లం దగ్గిరే కదా అనీ. అది వెళ్ళననే మూలిగేది; కాని బద్ధకం వల్ల అలా అంటోందనుకునీవాళ్ళం"

"సరే, కాళ్ళు కడుక్కుందామని చెర్లో దిగబోతూ ఉంటే.....?"

"చెర్లో దిగబోతూ ఉంటే యిద్దరు తురకలు మీదపడి, నోట గుడ్డలు కుక్కి మోటార్లో వేసుకుని-యెంతేనా గుంజుకుందిట నా బిడ్డ. కోడిపిల్లని గ్రద్ద తన్నుకుపోయినట్టు-"

"అయితే మీ మేనల్లుడి సంగతి యేమేనా చెప్పిందా? మీ రడిగారా?"

"అడిగానండి. అతగాడు చెరచడానికి చూశాడుట. మీరన్నది-"

"చూశాడూ? అయితే, ఇక వాడి పని పైసలా, క్షణం ఉండనివ్వనిక నాయింటోను. మరి పద, ఇక నుంచోకు"

"అయ్యో! మీ అమ్మాయి అందానికి భ్రమసి ఆశపడ్డందుకు మీ మేనల్లుణ్ణి హతమార్చడానికి చూస్తున్నారే-"

"అయ్యా! మీరు ఉద్యోగస్థులయితే అయారు. మీకు కోపం వస్తే నన్న కైదులో పెట్టేసుకోండి. కాని ఆ ఛండాలురాలిమాట యిక చెప్పకండి నాకు".

"............సరే వెళ్లు. కాని మరచిపోకు. మీ బ్రాహ్మణమతంలో సత్యం లేదు. దేవుడు లేదు. దానికి భవిష్యత్తు లేదు. వర్ణవ్యవస్థ అనేపేరుతో మనుష్యులను విడదీసి, మీ రుషులు, ప్రజలను మోసగించగలిగారే; గాని కాలాన్ని వంచించలేకపోయారు. మీ సిద్ధాంతాలే మీ కంఠాలకు కాలపాశాలై చుట్టుకుని నలిమేస్తున్నాయి. మీకిక పుట్టగతుల్లేవు..... నిన్ను చూస్తే పాపం చుట్టబెట్టుకుంటుంది, నా యెదుట నుంచోకు"

"రక్షించారు........"

"........... ఎంత పని జరిగిందీ? నా కళ్ల యెదుట నాసంఘంలో నుంచి వొక రత్నం జారిపోయింది. నాపదవి - నా శక్తి - నా పలుకుబడి - అన్నీ వ్యర్థం అయిపోయాయి.... కాని వేద మతం అంటే యిలాంటిదేనా...... కాదు కాదు... వీళ్లకి వేదం బోధపడదు. బోధపరుచుకోవాలని ప్రయత్నమేనా లేదు వీళ్లకి. వేదానికి ఈ బ్రాహ్మలు చేసిన వాఖ్యానాలు విషప్రాయాలు కాని అమృతసేకాలు కావు... తురకలు - క్రైస్తవులు - ఇంకా యితర్లు - అదృష్టవంతులు. ఆ మతాలలో సత్యం వుంది. దేవుదున్నాడు. ధర్మం వుంది. "యతో ధర్మ స్తతో జయః"... అయితే, హిందూదేశంలో యిప్పుడు జరిగే ప్రయత్నాలన్నీ అజ్ఞానజనితాలు. గడ్డిపోచలకంటే నికృష్టాలు. వాటివల్ల జాతికి మోక్షంలేదు. జాతి యిప్పుడు ఆచార్యుడి కోసం యెదురు చూస్తోంది...హిందూజాతికింకా పతనం పూర్తికాలేదు. అది పూర్తి అయేదాకా పునస్సృష్టి ప్రారంభంకాదు...అది యీతరంలోకాదు. ముందుతరంలో కాదు. ఈ కళ్లకి వెలుగులేదు. ఈ జీవితానికి ఆనందంలేదు....కాలం, కాలం. అమూల్యమైన కాలం. బంగారంలాంటి కాలం గడిచిపోతోంది... ఆచార్యుడు... ఆచార్యుడు....................."

◆